అందుకు రెండోవాడు ఒప్పుకున్నాడు. ఇద్దరూ అన్ని ఏర్పాట్లు చేసుకుని కాశీకి బయలుదేరారు. ఇద్దరూ నిత్యం ఏదో ఓ సత్కర్మ చేసి కాని నిద్రపోయేవారు కాదు. ఒకనాడు దారిలో ఒక గ్రామంలోని ఓ ఇంట్లో బస చేసారు. మర్నాటికి ఆ ఇంటివాళ్ళకి కట్టెలు అవసరమని తెలుసుకుని పెద్దవాడు వాళ్ళింట్లోని కలప నరికి కట్టెలు కొట్టి పడుకున్నాడు. ఆ ఇంటి వారమ్మాయి వివాహానికి వాళ్ళకి ధన సహాయం అవసరమని గ్రహించిన రెండోవాడు, మర్నాడు ఉదయం నిద్రలేచాక వాళ్ళకి తన దగ్గరున్న ధనంలోంచి కొంత సహాయం చేద్దామనుకున్నాడు.

దురదృష్టవశాత్తూ ఆ రాత్రే ఆ ఇద్దరు కవలలు మరణించారు.

ఇద్దరూ స్వర్గానికే వెళ్ళారు. కాని రెండోవాడి కన్నా పెద్దవాడికి స్వర్గ సుఖాలు ఎక్కువ స్థాయిలో లభించాయి. అది గ్రహించిన రెండోవాడు స్వర్గ లోకంలోని దేవతలని అడిగాడు.

"మేమిద్దరం చివరిదాకా సమానమైన పుణ్యమే చేసాం. ఐనా మా ఇద్దరి మధ్యా ఈ తేడా ఇక్కడ ఎందుకు వచ్చింది?"

"మీకు ఆతిథ్యం ఇచ్చిన గృహస్థుకి కట్టెలు కొట్టిచ్చిన పుణ్యం మీ అన్నకి అధికంగా వుంది. నువ్వు వాళ్ళకి ధన సహాయం చేయాలనుకున్నావు కానీ, దాన్ని మర్నాటికి ఎందుకు వాయిదా వేసావు? కట్టెలు కొట్టడం కన్నా అది తక్కువ శ్రమతో కూడిన పని కదా?" అడిగారు దేవతలు.

అందుకే 'నిత్యం సన్నిహితో మృత్యుః కర్తవ్యో ధర్మ సంగ్రహః' అన్నారు. 'సదా మృత్యువు మనల్ని కబళించడానికి సిద్ధంగా వుంటుంది కాబట్టి ధర్మకార్యాలని ఎప్పుడూ వాయిదా వేయకూడదు' అని దీనర్థం.

## 34. అహం

ఓ గురువు వద్ద అనేకమంది శిష్యులు ఆధ్యాత్మిక విద్యని అభ్యసిస్తున్నారు. ఓ రోజు ఆయన వారితో చెప్పాడు.

"దేవుడు, మనిషి ఒకటే. కానీ మనిషికి తను దేవుడినన్న విషయం స్ఫురణకి రాకుండా చేసేది ఒక్కటే-అహం. అహం అంటే తను ఆత్మ కాక, ఈ శరీరమే తను అనుకోవడం. ఇందులోంచే 'నేను, నాది' అనే భావనలు, వాటిలోంచి స్వార్థం జనిస్తాయి. ఈ 'అహం' అనే పొరని ఛేదించగలిగితే మీరు దేవుడవుతారు. మన ప్రయత్నం కొంత, దైవ కృప కొంత తోడైతే కానీ అది తొలగదు. అందుకు మీరు దైవ ప్రార్థన చేయండి."

అది వంటపట్టించుకున్న ఒక శిష్యుడు దాన్ని ఆచరణలో పెట్టాలనుకున్నాడు. తనని తాను 'నేను మా గురువుగారి పాదరేణువున'ని చెప్పుకోసాగాడు. అది గురువు చెవిన పడింది. శిష్యుడ్ని పిలిచి ఎందుకలా చెప్తున్నావని అడిగాడాయన.

"నాలోని అహం చచ్చింది గురుదేవా! నన్నంతా మీ పాదరేణువు అంటేనే నాకు తృప్తి." వినయంగా జవాబు చెప్పాడు శిష్యుడు.

"తప్పు. దైవానుగ్రహం తోడైతే తప్ప, మన ప్రయత్నంతో అహం తొలగదు. అందుకు నిత్యం దైవప్రార్థన చేయడం ఒక్కటే గత్యంతరం. నీ తోటి శిష్యులని చూసైనా నేర్చుకో." హితవు చెప్పాడు గురువు.

అయితే ఆ శిష్యుడు తనలోని అహం తొలగిందనే నమ్మసాగాడు తప్ప గురువు సలహాని ఖాతరు చేయలేదు.

కొన్నాళ్ళకు గురువు శిష్యులతో తీర్థయాత్రలకి బయల్దేరాడు. దారిలో ఓ రాత్రి, వారు ఒక గృహస్థు ఇంట్లో బస చేసారు. భోజనాల దగ్గర గురువు తన శిష్యులందరినీ గృహస్థుకి, అతని కుటుంబ సభ్యులకి పరిచయం చేసాడు. శిష్యులందరి పేర్లు చెప్పి, అహం చచ్చిందన్న శిష్యుడ్ని చూపించి చెప్పాడు.

"ఇతని పేరు ఎందుకు కాని, నా పాదరేణువు ఇతను."

అది విన్న ఆ కుటుంబ సభ్యులంతా ఫక్కున నవ్వారు. శిష్యుడికి

ఆ నవ్వులు ఎంతో అవమానకరంగా తోచి మొహం ఎ్రరబడింది. బయటకి వచ్చాక దారిలో గురువు ఆ శిష్యుడితో చెప్పాడు.

"నీలో అహం చావలేదని అర్ధమైందా? ఇకనించి అందరికీ నీ పేరే చెప్తూండు. 'అహం' అనే ఆ పొర బలమైంది. మన ప్రయత్నంతో అది పూర్తిగా చిరగదు. దైవానుగ్రహంతోనే తొలగిపోతుంది."

అప్పటినించి ఆ శిష్యుడు, ఇతర శిష్యుల్లా దైవానుగ్రహం కోసం ప్రార్థించసాగాడు.

## 35. జమ

ఓ ఊరికి ఓ సిద్ధపురుషుడు వచ్చాడు. ఆయన దగ్గరకి ప్రజలంతా తమ తమ కోరికలతో రావడం మొదలుపెట్టారు. ఎవరైనా ఏదైనా కోరికతో వెళ్ళినప్పుడు ఆయన అది తీరుతుందంటే సత్వరం నిజమయ్యేది. దాంతో తమ కోరికలు నివేదించుకోవడానికి ప్రజలు ఆయన దగ్గరకి తండోప తండాలుగా రాసాగారు.

ఐతే, ఆయన అందరితో 'నీ కోరిక తీరుతుందిపో' అనేవాడు కాదు. కేవలం కొందరితోనే ఆ ముక్క అనేవాడు. ఆయన అనడమేమిటి, ఎంత గట్టి రోగమైనా తగ్గేది. ఆర్థిక బాధలు తొలగేవి. పిల్లల చదువుల్లో అభివృద్ధి కనిపించేది. ఆస్తి తగాదాలు సత్వరం పరిష్కారమయ్యేవి. కాని, కొందరు ఎంత చిన్న కోరిక కోరినా అది తీరుతుందనేవాడు కాదు.

వాళ్ళల్లో ఓ భక్తుడు నిత్యం ఆయన దగ్గరకి వచ్చి తన జీతంలో ఓ పాతిక రూపాయలు ఇంక్రిమెంట్ వచ్చేలా చేయమని కోరసాగాడు. సాధువు మాత్రం మిన్నకుండేవాడు. ఆయన ఊరు విడిచి వెళ్ళే రోజు కూడా ఆ భక్తుడు వచ్చి తన చిన్న కోరికని తీర్చమని వేడుకున్నాడు.

అప్పుడు సాధువు అతని వంక వాత్సల్యంగా చూస్తూ చెప్పాడు.